మల్టీపర్పస్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

మాట్లాడుతున్న మల్టీ పర్పస్ కార్మికులు

ఇచ్చోడ, జూలై 15 : ముక్రా(బీ) గ్రామ పంచాయతీలో మల్టీ పర్పస్‌గా పని చేస్తున్న కార్మికులకు ఆరు నెలల నుంచి వేతనాలు రావడం లేదని ఆరోపించారు. తమకు వేతనాలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తామన్నారు. కార్యదర్శి, ఎంపీడీవోను వేతనాలు అడిగితే రేపు, ఎల్లుండి అంటూ కాలం వెల్లదీస్తున్నారన్నారు. వెంటనే తమకు వేతనాలు చెల్లించాలని లేని పక్షంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్టీ పర్పస్ కార్మికులు సంతోష్, అడెల్లు, చందర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోథ్, జూలై 15: మండల కేంద్రంలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ సోమవారం ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కల్టెర్ రాజర్షి షాకు వినతిపత్రం ఇచ్చారు. సాయినగర్, శాంతి నగర్ కాలనీల్లో చౌక ధరల దుకాణాలు లేక ఇబ్బందులకు గుర వుతున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఇక్కడ ఆరె రమేశ్ పాటిల్ ఉన్నారు.

బదిలీలు, ఉద్యోగోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

ఉట్నూర్, జూలై 15: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బదిలీలు, ఉద్యోగోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్‌సింగ్, నవీన్ యాదవ్ సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూగుప్తాను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 317 జీవో బదిలీ అయిన వారికి పాతస్థానాన్ని చూపిస్తూ పాయింట్స్ కేటాయించాలని కోరారు. మ్యూచ్‌వల్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులకు కూడా బదిలీలో అవకాశం కల్పించాలని, పండిత్ తెలుగు, హిందీ, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించాలని కోరారు. ఆన్‌లైన్ అప్లై తేదీని పొడిగించాలని కోరారు. ఇక్కడ నాయకులు జాదవ్ ప్రకాశ్, దినేశ్, బాబు సింగ్, ప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్, జూలై 15 : విద్యార్థులు శ్వాసకోస సంబంధిత సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. మానసిక వైద్య నిపుణులు రఘునాథ్ మిర్యాల, జనరల్ మెడిసిన్ నిపుణుడు సీహెచ్ వెంకటభార్గవ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శ్వాస కోస సమస్య వస్తే ఏలా నివారించుకోవాలో వివరించారు. పరిస్థితి విషమంగా ఉంటే నేరుగా ఉట్నూర్, రిమ్స్‌కు రెఫర్ చేయాలని సూచించారు. ఇక్కడ వైద్యాధికారి రాంబాబు, ప్రిన్సిపాల్ ఉపేందర్, ఆరోగ్య విస్తరణాధికారి చౌహాన్ నాందేవ్, ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు చర్యలు

నార్నూర్, జూలై 15 : దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటామని ఆరోగ్య విస్తరణాధికారి పవార్ రవీందర్ అన్నారు. సోమవారం గాదిగూడ మండలం తోయగూడలో వైద్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తుల రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు బాపురావ్, సురేశ్, ఆశ కార్యకర్త అససూయబాయి పాల్గొన్నారు.

మద్రాస్ ఐఐటీకి విద్యార్థి ఎంపిక

సాయివంశీ

బోథ్, జూలై 15 : బోథ్‌లోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థి సాయివంశీ మద్రాస్ ఐఐటీకి ఎంపిక అయ్యాడు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆదర్శ పాఠశాల బోథ్‌లో చదువు పూర్తి చేశాడు. ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి ఐఐటీ మద్రాస్ యూనివర్సిటీలో డాటా సైన్స్ విభాగంలో సీటు సాధించాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ ఎం ఉమేశ్‌రావ్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఎన్‌సీసీకి 29 మంది విద్యార్థులు ఎంపిక

మాట్లాడుతున్న ఎన్‌సీసీ ఆఫీసర్ అన్వర్ అలీ

బోథ్, జూలై 15: సోనాలలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం 29 ఎన్‌సీసీ సీట్లకు విద్యార్థులు ఎంపిక అయ్యారు. ఇందులో 13 మంది బాలికలు, 16 మంది బాలురు ఎంపిక అయ్యారు. కార్యక్రమంలో పాఠశాల అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ అన్వర్ అలీ, పర్యవేక్షకుడు ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయులు దేశ్‌ముఖ్, సచిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నార్నూర్, జూలై 15 : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని దేవిభక్త శేఖర్ మహారాజ్ అన్నారు. మహారాష్ట్రలోని పొరదేవి నుంచి మండలంలోని ఉమ్రి గ్రామానికి శేఖర్ మహారాజ్ చేరారు. గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని జగదాంబదేవి, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో భోగ్ బండార్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహారాజ్ ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు మహారాజ్ ఆశీస్సులు పొందారు. ఇక్కడ సేవాలాల్ ధర్మ ప్రచారక్ ప్రేమ్‌సింగ్, గ్రామ పెద్దలు, యువకులు ఉన్నారు.

ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, జూలై 15: ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఎయిర్ ఫోర్స్ రిక్రూట్ మెంట్‌పై అనిల్ గోస్వామి, ఎస్టీ జాట్‌లు అవగాహన కల్పించారు. ఈ నెల 5 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అక్టోబర్ 18వ తేదీన రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. పదోతర గతి, ఇంటర్ అర్హత ఉండాలని రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారు ఫిజికల్, మెడికల్ పరీక్షలు ఉంటాయన్నారు. ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుభీర్: కేజీబీవీలో మొక్కలు నాటుతున్న ఎస్వో, విద్యార్థులు

దస్తురాబాద్ : మొక్కలు నాటుతున్న ఎస్ఐ శంకర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

మొక్కల సంరక్షణపై బాధ్యత తీసుకోవాలి

కుభీర్, జూలై 15 : మొక్కలను నాటి వాటి సంరక్షణకు ప్రతి విద్యార్థి బాధ్యత తీసుకోవాలని ఎస్వో వాణి సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఆర్టీలు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ

దస్తురాబాద్, జూలై 15 : చెట్లతోనే మానవ మనుగడ అని ఎస్ఐ ఆర్ శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో సోమవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి ఎస్ఐ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో రవిప్రసాద్, టీపీ గోవింద్, ప్రజాప్రతినిధులు, నాయకులు, పోలీస్, ఈజీఎస్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి

దస్తురాబాద్ : ఆకొండపేటలో ర్యాలీ తీస్తున్న హెచ్ఎం కోట వేణు, అంగన్‌వాడీ టీచర్ రాజమణి, గ్రామస్తులు

దస్తురాబాద్,జూలై 15 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు కోట వేణు, అంగన్‌వాడీ టీచర్ రాజమణి కోరారు. సోమవారం అకొండపేటతో పాటు పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు ర్యాలీ తీశారు.

భైంసాటౌన్, జూలై 15 : వానల్‌పాడ్ గ్రామంలో అంగన్‌వాడీ, జీపీ సిబ్బంది, నాయకులు అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్పన, కార్యదర్శి గాయత్రి, మాజీ ఉప సర్పంచ్ ఈశ్వర్, నాయకులు రాంకుమార్, శ్రీనివాస్, అంగన్‌వాడీ సిబ్బంది సుమిత, లలిత పాల్గొన్నారు.

జైనథ్, జూలై 15: మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శృతి కోరారు. మండల కేంద్రంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ తీశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంగీత, పద్మ, స్వప్న, సుచరిత, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అంగన్‌వాడీ టీచర్ల వినతి

నేరడిగొండ, జూలై 15 : ప్రభుత్వం జీవో నంబర్ 10 వెంటనే రద్దు చేయాలని మండల అంగన్‌వాడీ టీచర్లు సోమవారం నేరడిగొండలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అంగన్‌వాడీ టీచర్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛన్ పెంచాలన్నారు. వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో ఇవ్వాలని, అంగన్‌వాడీల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై పోరాడుతానని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండలాధ్యక్షుడు నక్క లక్ష్మణ్, నాయకులు గోవన్‌సింగ్, మాజీ సర్పంచ్ వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ పండరి, మండల కన్వీనర్ శివారెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు సురేందర్, పాండు, అరుణ్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

క్రీడాకారులకు పీవో సన్మానం

క్రీడాకారులతో ఐటీడీఏ పీవో, అధికారులు

ఉట్నూర్, జూలై 15: ఆదివాసీ, గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించే విధంగా శిక్షణ ఇస్తున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. ఉట్నూర్‌లోని క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు పూసం మోతీరాం, చౌహాన్ సాయిరాం, ఆత్రం జగ్జీవన్, జాదవ్ చరణ్, ఆత్రం శంభు, రాథోడ్ ధన్‌రాజ్ జాతీయ సబ్ జూనియర్ హాకీ పోటీలకు ఎంపికయ్యారు. దీంతో వారిని సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో సన్మానించారు. ఈ నెల 19 నుంచి 29 వరకు కేరళ రాష్ట్రం కొల్లంలో జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీలకు తెలంగాణ తరపున హాజరవుతారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్ కుమార్, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, గిరిజన విభాగం జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, కోచ్ సునంద్ పాల్గొన్నారు.

ఉట్నూర్ నుంచి హైదరాబాద్‌కు బస్సులు ప్రారంభం

ఉట్నూర్, జూలై 15: ఉట్నూర్ బస్ డిపో నుంచి హైదరాబాద్‌కు మంగళవారం నుంచి బస్సులు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు ఒకటి, 11.30 గంటలకు మరోకటి సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కావున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు

నిర్మల్ అర్బన్, జూలై 15: నిర్మల్‌లోని నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రాజు తెలిపారు. వర్షాల నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారు 7036661070 నంబర్ కు సమాచారం అందించినట్లయితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, జూలై 15 : ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రియదర్శిని నగర్‌లో వైద్య సిబ్బంది చైర్మన్‌కు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో అసంక్రమిత వ్యాధులు సంభవించకుండా పట్టణంలోని అన్ని వార్డుల్లో ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తారన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇచ్చోడ(సిరికొండ), జూలై 15 : సిరికొండ ఉప సర్పంచ్ తోకల చందు తండ్రి, అదే గ్రామానికి చెందిన దాసరి రజిత ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. రజిత కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు పెంటన్న, కృష్ణారెడ్డి, ప్రీతమ్ రెడ్డి, సూర్యకాంత్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తానూర్, జూలై 15 : ఏల్వీ గ్రామానికి చెందిన విలేకరి గంగారెడ్డి రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ పరామర్శించారు. వారి వెంట నాయకులు ఓం ప్రకాశ్ లడ్డా, రాంచంద్రపటేల్, మాధవ్‌రావుపటేల్, గోవింద్‌పటేల్, దేవీదాస్, పోతారెడ్డి ఉన్నారు.

నిర్మల్ చైన్‌గేట్, జూలై 15 : నిర్మల్‌లోని బాగులవాడలో ఎఫ్ఏసీఎస్ చైర్మన్ ధర్మాజి రాజేందర్ సోదరుడు రాజేశ్వర్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రాంచందర్ పరామర్శించారు. ఆయన వెంట మాణిక్‌రెడ్డి, భాస్కర్, ఈశ్వర్ ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

భైంసా, జూలై 15 : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం ప్రతిమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఏమైనా సలహాలు, సందేహాలు ఇవ్వాలనుకున్న వారు 995922605 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేరడిగొండలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నేరడిగొండ, జూలై 15 : బోథ్ నియోజకవర్గంలోని వివిధ మండలాల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఉదయం 11 గంటలకు నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అందజేయనున్నట్లు మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వివిధ మండలాలకు చెందిన 121 మంది లబ్ధిదారులకు సంబంధించిన చెక్కులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులతో పాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

బ్యాంకు సిబ్బందికి సన్మానం

బోథ్, జూలై 15 : సోనాలలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆరు సంవత్సరాల నుంచి సేవలు అందించి బదిలీపై వెళ్తున్న క్యాషియర్ శివ, అకౌంటెంట్ కమల్‌ను సోమవారం నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ నరేందర్ శర్మ, బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, మహర్ సంఘం అధ్యక్షుడు కాంబ్లే భీంరావ్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

నిర్మల్ అర్బన్, జూలై 16 : నిర్మల్‌లోని ఎన్టీఆర్ మార్గ్ ఐదో నంబర్ రోడ్డును ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రం ఇచ్చారు. రోడ్డును ఆక్రమించిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకొని కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఇక్కడ విశ్వనాథ్, రాజ్‌కుమార్, రాఘవేందర్ ఉన్నారు.

ప్రిన్సిపాల్‌గా లలిత కుమారి

ఎదులాపురం, జూలై 15 : ఆదిలాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం లలిత కుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడ పని చేసిన ఎస్ శ్రీనివాస్‌ను సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. కాగా లక్షెట్టిపేటలోని గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ప్రిన్సిపాల్ లలితకుమారిని ఆదిలాబాద్‌లోని బాలికల గురుకులం పాఠశాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమె గతంలో 2002-2006, 2011, 2016వరకు ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన అమెను అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

నిషేధిత గుట్కా పట్టివేత

లోకేశ్వరం, జూలై 15 : పుస్పూర్ గ్రామ శివారులో నిషేధిత గుట్కా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం... భైంసాకు చెందిన అబ్దుల్ నయీం సోమవారం భైంసా నుంచి లోకేశ్వరం గ్రామానికి గుట్కా ప్యాకెట్లను బైక్‌పై తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రూ.25వేల విలువ గల గుట్కా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలపై కాంగ్రెస్‌ను నిలదీయాలి

ఇంద్రవెల్లి, జూలై 15: గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కాంగ్రెస్‌ను నిలదీయాలని ఎంపీ నగేశ్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మెస్రం వంశీయులతో కలిసి ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్ ఎంపీ నగేశ్‌కు స్వీట్ తినిపించి శాలువాతో సన్మానించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మండల నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన సభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజలింగు, మాజీ జడ్పీటీసీ ఆర్కా పుష్పలత, మాజీ ఎంపీపీ కనక తుకారాం, నాయకులు ఖమ్ము, రాజేశ్వర్, హనుమంత్‌రావ్, రాంషావ్, గోవింద్‌రావ్, సుంగుపటేల్, లాల్‌షావ్, రాజ్‌వర్ధన్, మరప రాజు, దీపక్‌సింగ్ షేకపత్, చంపత్‌రావ్‌పటేల్, దశరథ్ గారుశే, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: నాగోబా ఆలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీ నగేశ్

రాజన్న ఆలయంలో ఎంపీ నగేశ్ ప్రత్యేక పూజలు

దస్తురాబాద్, జూలై 15 : మండలంలోని గొడిసేర్యాల గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు నగేశ్ ప్రత్యేక పూజలు చేశారు. నిలువెత్తు (బెల్లం) తులభారం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు బీజేపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, మండలాధ్యక్షుడు కొడిమెల లక్ష్మణ్, నాయకులు వెంకట రమణ, సాగర్ గౌడ్, మల్లయ్య, రాజు, తులసీరాం, హనుమగౌడ్, సత్యం, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడికి సన్మానం

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న కిసాన్ సేవా సమితి సభ్యులు

భైంసా, జూలై 15 : లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ ముత్యం రెడ్డి ఎన్నిక కావడంతో కిసాన్ సేవా సమితి సభ్యులు సోమవారం పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కిసాన్ సేవా సమితి అధ్యక్షుడు అల్లకొండ సాయినాథ్, ఉపాధ్యక్షుడు కాండ్లి సాయినాథ్, కోశాధికారి అల్లకొండ కిషన్, కుంట కాశీనాథ్, కుంట శ్రీను, ప్రకాశ్, కారిగిరి శ్రీనివాస్ బండి రవి, గంగాధర్ పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై దృష్టిని సారించాలి

జైనథ్, జూలై 15 : మహిళా సంఘాల సభ్యులు పెరటి కోళ్ల పెంపకంపై దృష్టిని సారించాలని మండల పశువైద్యాధికారి వినోద్ దేశ్‌పాండే సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో పెరటి కోళ్ల లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శ రైతు దశరథ్ రాంరెడ్డి, ఏపీఎం భగవాండ్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కుభీర్‌లో ఓ ఇంట్లో చోరీ

కుభీర్, జూలై 15: కుభీర్‌లోని తిప్ప భోజన్నకు చెందిన ఇంట్లో మార్కెట్ కమిటీ కార్యదర్శి గంగన్న అద్దెకు ఉంటున్నారు. ఈ నెల 14వ తేదీ ఆయన తన కుటుంబీకులతో కలిసి బంధువుల అంత్యక్రియలకు ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కజ్జర్లకు వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి యజమాని కొడుకు రవి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి తలుపు తెరిచి ఉండడాన్ని గమనించి గంగన్నకు ఫోన్‌లో సమాచారం అందించారు. కాగా సాయంత్రం ఇక్కడికి చేరుకున్న వారు ఇంట్లోకి వెళ్లి చూసే సరికి కిచెన్‌లోని ఒక డబ్బాలో దాచుకున్న రూ.7వేలు, ఇంటి బయట ఉంచిన షైన్ బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు కుభీర్ ఎస్ఐ రవీందర్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంటలోపే పోలీసుల అదుపులో దొంగ

ఎదులాపురం, జూలై 15 : ఆదిలాబాద్ టూ టౌన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగిన కేసు నమోదైన గంటల వ్యవధిలోనే పోలీసులు దొంగను పట్టుకున్నట్లు సీఐ సీహెచ్.కరుణాకర్‌రావు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఇందిరానగర్‌లో భరత్ అనే వ్యక్తి ఇంట్లో ఎవరు లేకపోవగా గత రాత్రి కిష్టు అనే వ్యక్తి రూ.3వేలు నగదు, తులం బంగారాన్ని దొంగలించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని గంట వ్యవధిలోనే దొంగను పట్టుకున్నారు. ఐడీ పార్టీ సిబ్బంది రమేశ్, సుధాకర్, క్రాంతి, నరేందర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఉట్నూర్ రూరల్, జూలై 15: మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన జక్కుల పవన్ కళ్యాణ్(21) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. జక్కుల ఊశన్న వ్యవసాయం చేసుకుంటు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమారుడు పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. దీంతో తల్లిదండ్రులు పెళ్లి చేసుకొని ఇంటివద్దే వ్యవసాయం చేసుకుంటు ఉండమని కొడుకు చెప్పారు. ఇక్కడ వ్యవసాయం చేయడం ఇష్టం లేదని హైదరాబాద్‌కు వెళ్లానని తల్లిదండ్రులకు పవన్ చెప్పాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు మందలించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి ఊశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

చెమ్మన శేఖర్(ఫైల్)

బోథ్, జూలై 15 : విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొచ్చెర గ్రామానికి చెందిన చెమ్మన శేఖర్(22) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా మంచి నీటి ట్యాంకు బిగిస్తున్నాడు. ఈ క్రమంలో 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోద